TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 95 | శనివారం, ఆగస్టు 3, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## జాబ్ క్యాలండర్ విడుదల...



హైదరాబాద్: జాబ్ క్యాలండర్ గురించి ముందే ప్రకటించామని, అందులో భాగంగానే దానిని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అసెంబ్లీలో శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రశ్నాపత్రాల లీక్, పరీక్షలు వాయిదా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని, నిరుద్యోగ యువతీ, యువకుల ఆశలు నెరవేర్చేందుకు ఈ జాబ్ క్యాలండర్ అని ఆయన పేర్కొన్నారు. ఆ విధంగానే సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జాబ్ క్యాలండర్‌ను విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాల ప్రకటనలు, రద్దు కావడం, వాయిదా వేయడం, ప్రశ్నాపత్రాల లీక్, పరీక్షల తేదీలు ఓవర్ లాప్‌తో ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వ పాలనలో గ్రూప్ 1 పరీక్ష రెండుసార్లు రద్దు అయ్యిందన్నారు. 2023 సంవత్సరం మార్చి 17వ తేదీన పేపర్ లీక్, 2024 ఫిబ్రవరి 19వ తేదీన అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోకపోవడంతో హైకోర్టు తీర్పు మూలంగా రద్దు అయ్యిందన్నారు.

### వాయనాడ్‌లో వరద బీభత్సం... స్కూల్ ధ్వంసం..

## 49 మంది పిల్లలు గల్లంతు



తిరువనంతపురం: మూడు రోజుల క్రితం వాయనాడ్ జిల్లాను కుదిపివేసిన కొండచరియల దుర్ఘటనల్లో కనీసం 49 మంది పిల్లలు గల్లంతు కావడం లేదా మరణించడం జరిగిందని కేరళ సార్వత్రిక విద్యా శాఖ మంత్రి వి శివన్‌కుట్టి శుక్రవారం వెల్లడించారు. శివన్‌కుట్టి తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ.. వెల్లరిమలలో ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రకృతి వైపరీత్యానికి పూర్తిగా ధ్వంసమైందని, ఆ పరిసరాల్లోని మరి నాలుగు పాఠశాలలు పెద్ద లేదా చిన్న నష్టానికి గురయ్యాయని తెలిపారు. ప్రాణాలతో బయటపడిన పిల్లల్లో అనేక మంది పాఠ్యపుస్తకాలు, సర్టిఫికేట్లు కోల్పోయారని, ప్రభుత్వం వీటన్నిటినీ పరిశీలించి, ముఖ్యమంత్రితో చర్చించిన తరువాత వారికి సాయం చేస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం.. 89 మంది మహిళలు, 29 మంది పిల్లలతో సహా 210 మృతదేహాలను ఇంత వరకు వెలికితీశారు.

### నీట్-యుజి 2024పై...

## సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: పరీక్షా విధానంలోని లోపాలను నిపుణుల కమిటీ తప్పక సరిదిద్దాలని సుప్రీంకోర్టు పేర్కొంది. నీట్-యుజి 2024 పరీక్షకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లేదా ఎన్ టిఏ చేసిన అవకతవకలను తప్పక నివారించాలని ఆగస్టు 2 (శుక్రవారం) సుప్రీంకోర్టు పేర్కొంది. జాతీయ పరీక్షలో ఇటువంటి "ఫ్లిప్-ఫ్లాప్‌లు" విద్యార్థుల ప్రయోజనాలకు ఉపయోగపడవని పేర్కొంది. పేపర్ ఆరోపణలు మరియు పరీక్షలో ఇతర అవకతవకలపై తీవ్ర వివాదం ఉన్నప్పటికీ, 2024 నీట్-యుజి మెడికల్ ప్రవేశ పరీక్షను రద్దు చేయకపోవడానికి కారణాలతో కూడిన తీర్పును సుప్రీం కోర్టు ప్రకటిస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం, పరీక్షా విధానంలోని లోపాలను నిపుణుల కమిటీ తప్పక సరిదిద్దాలని పేర్కొంది.

## హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ స్టేడియం



హైదరాబాద్: క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిఖత్ జరీన్‌కు ఆర్థిక సాయం చేయడంతో ఇంటి స్థలం కేటాయిస్తామని, టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు విద్యార్హత లేకున్నా గ్రూప్-1 ఉద్యోగం ఇస్తున్నామని స్పష్టం చేశారు. శాసన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో త్వరలో క్రీడా విధానం తీసుకొస్తామని, హర్యానా క్రీడా విధానం పరిశీలిస్తున్నామని, త్వరంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తామని, స్పోర్ట్ పాలసీపై ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మరో క్రికెట్ మైదానం వస్తుందని, యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాల్లో క్రీడలు తగ్గాయని, ఎల్‌బి స్టేడియంలో క్రీడలు తగ్గడంతో పాటు రాజకీయ కార్యకలాపాలు పెరిగాయన్నారు. హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం తీసుకొస్తామని, స్కిల్ యూనివర్సిటీ సమీపంలో అంతర్జాతీయ స్టేడియం నిర్మిస్తామని, బ్యాగరికంచెలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బిసిసిఐతో చర్చలు జరిపామని రేవంత్ రెడ్డి తెలియజేశారు. క్రీడల కోసం బడ్జెట్‌లో రూ.321 కోట్లు కేటాయించామని, హర్యానా తరహాలో క్రీడాకారులను పోత్సహిస్తామన్నారు. భూముల లభ్యత చూసి మండల కేంద్రాల్లో స్టేడియాలు నిర్మిస్తామని, తెలుగువర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## రూ.5లక్షల కోట్లు హాంఫట్




ముంబై: అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల కారణంగా దేశీయ స్టాక్‌మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద రూ.5 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది.

అమెరికాలో నిరుద్యోగం పెరగడం, క్షీణించిన ఫ్యాక్టరీ డేటా వల్ల మందగమం ఆందోళనలు పెరిగాయి. ఈ సంకేతాలు గ్లోబల్ మార్కెట్ల పతనానికి కారణమయ్యాయి. ఈ టెన్షన్ వల్ల ఇప్పటికే ఆల్‌టైమ్ హైలో ఉన్న భారత్ మార్కెట్లలోనూ ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్ చేపట్టారు. దీంతో మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ 25,000 మార్క్ దిగువకు పడిపోయింది. సెన్సెక్స్ 885 పాయింట్లు పతనమై 80,982 పాయింట్ల వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు భారీగా నష్టపోయాయి.

### తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాయిదా..

## 5 బిల్లులకు ఆమోదం



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. తొమ్మిది రోజుల పాటు అనేక విషయాలపై సభలో వాడివేడీ చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో మొత్తంగా ఐదు బిల్లులకు ఆమోదం లభించింది. దాదాపు 32 ప్రశ్నలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. 65 గంటల 33 నిమిషాల పాటు నిర్వహించగా రెండు ప్రశ్నలపై స్వల్పకాలిక చర్చ చేశారు. కాగా ఈ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తెలంగాణ పూర్తి స్థాయి బడ్జెట్ రూ. 2,91,191 కోట్లతో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరి రోజైన శుక్రవారం కాంగ్రెస్ సర్కారు పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సివిల్ కోర్టు సవరణ బిల్లును సమర్థిస్తూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రభుత్వానికి కొన్ని సూచనలను చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెంచాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కోర్టులకు సొంత భవనాలు లేవని, అద్దె భవనాల్లో కోర్టులు నిర్వహించడం బాధాకరం అన్నారు. నియోజకవర్గాల్లో జూనియర్ సివిల్ కోర్టులు లేవన్నారు. కేసులు సత్వర పరిష్కారం కావాలంటే జూనియర్ సివిల్ కోర్టులు పెంచాలన్నారు.

### తెలంగాణలో జిఎస్‌డిపి...

## 16 శాతం పెరిగింది: కాగ్

హైదరాబాద్: రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గిందని కాగ్ నివేదికలో వెల్లడించింది. 2023 మార్చితో ముగిసిన ఏడాదికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ నివేదిక ఇచ్చింది. తెలంగాణ జిఎస్‌డిపి 2021-22తో పోలిస్తే 2022-23లో 16 శాతం పెరిగిందని, రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర పెరిగాయని, సొంత పన్నుల రాబడి గణనీయంగా 17 శాతం పెరిగిందని, సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగిందని, 2023 మార్చి నాటికి పూర్తి కావాల్సిన 20 ప్రాజెక్టుల అంచనా వ్యయం పెరిగిందని, రూ.2749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారని కాగ్ నివేదికలో పేర్కొంది. 2022-23లో ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్స్‌లు 150 శాతం పెరిగాయని, సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసిందని, 2022-23లో బడ్జెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా వేసిందని, ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించిందన్నారు. రాష్ట్రాభివృద్ధి రుణాల వడ్డీపై ఖర్చు తక్కువగా అంచనా వేస్తున్నారని, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను భారీగా అంచనా వేస్తున్నారని, ఎపి నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు రాలేదని, ఇళ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌ఫామ్ పథకాల నిధులు ఖర్చు కాలేదని, దళితబంధు, రుణమాఫీ పథకాలకు కేటాయింపుల్లో భారీగా ఖర్చు కాలేదని కాగ్ తెలిపింది.

### బిఆర్ఎస్ ఓటమికి

## అది కూడా కారణం

: అక్బరుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమికి ధరణి పోర్టల్ కూడా ఓ కారణమని ఎంఐఎం ఎంఎల్ఏ అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ మిత్రులు ఈ విషయాన్ని అంగీకరించాలని సూచించారు. కాగా ధరణి పోర్టల్ ను వీలైనంత త్వరగా మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన సూచించారు. ధరణి వచ్చాక ఎవరిపై ఎన్ని భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయెూ తాను వివరాలతో సహా వివరిస్తానని అన్నారు. రాష్ట్రప్రభుత్వం ధరణి పోర్టల్ పేరును ఇప్పటికే 'భూమాత'గా మార్చింది. ఈ మేరకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది కూడా. ధరణి సమస్యలపై అధ్యయనం కోసం కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సిఫారసుల మేరకు ధరణి పోర్టల్ ను భూమాతగా మార్చారు. సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఏర్పాట్లు కూడా చేశారు.

## సిట్ టు రైట్

### హక్కు వారికి కల్పిస్తాం



హైదరాబాద్ : సెక్యూరిటీ గార్డులు, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు, పోలీస్ హోంగార్డులకు సిట్ టు రైట్ కూర్చునే హక్కు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి.. ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు రోజుకు 10 నుంచి 12 గంటల నిలబడి విధులు నిర్వహిస్తున్నారని, ఈ విషయంలో వారికి ఉపశమనం కలిగేలా పని వేళలో వారికి కూర్చునే హక్కు కల్పించాలనే ప్రతిపాదనపై సభలో సీఎం స్పందిస్తూ, ప్రస్తుతం ఈ విధానం దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో అమలు అవుతున్నందునా అక్కడ ఉన్న విధివిధానాలను పరిశీలించి సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, సీఎం స్పందనతో లక్షలాది మంది ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. పని వేళలో కనీసం కూర్చోవడానికి సైతం అనుమతి లేక కుటుంబ పోషణ కోసం గంటల తరబడి నిల్చోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం గనుక సానుకూల నిర్ణయం తీసుకుంటే ఇన్నాళ్లు పడుతున్న తమ బాధలకు విముక్తి కలుగుతుందనే సంతోషం ఈ తరగతి ఉద్యోగులలో వ్యక్తం అవుతున్నది.

# అంగన్వాడి కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రామడుగు మండలంలోని కొక్కెరకుంట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లిపాల విశిష్టత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నపిల్లల బరువు ఎత్తును కొలతలు వేశారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రపాలు పట్టించాలని, తద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదుగుతారని అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలు బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై మెడికల్ ఆఫీసర్ గ్రీష్మణీయ పలు సూచనలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో సూపర్వైజర్ సుధారాణి, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

# బోనమెత్తిన అల్ఫోర్స్ సంస్థల అధినేత

## - అల్ఫోర్స్ లో ఘనంగా బోనాల పండుగ






**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** అల్ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్ రెడ్డి బోనమెత్తారు. రామడుగు మండలం గోపాలరావుపేటలోని అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం ఆషాడ మాస బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు అందరూ బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై బోనాల వేడుకలు తిలకించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణలో బోనాల ఉత్సవాలు ఎంతో ప్రాముఖ్యమైనవని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యంగా ఉండాలని ప్రతి ఏటా ఆషాడం మాసంలో బోనం ఎత్తడం తెలంగాణలో ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సరియైన సమయంలో బస్సులు నడపాలి

## - డిపో మేనేజర్ గారికి వినతి పత్రం అందచేసిన బి ఆర్ ఎస్ వి విభాగం రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున సిరిసిల్ల ఆర్టీసీ డిపో అధికారులకు సరిఅయిన సమయంలో బస్సులు నడపాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్బంగా రవి గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్న విద్యార్థులకు సరియైన సమయంలో బస్సులు నడపాలని కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యాలు లేవని నాలుగైదు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి బస్సు కోసం ఎదురు చూపులు చూస్తున్నారని అలాంటి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే బస్వాపూర్ బద్దెనపల్లి గ్రామాలకు కళాశాల టైమింగ్ లో బస్సులు నడిపించాలని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని వారి ఉన్నత చదువులకు కృషి చేయాలని డిపో మేనేజర్ ని కోరారు. కళాశాల టైంలో బస్సుల సంఖ్యను పెంచాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం తరపున విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి సరైన సమయంలో విద్యార్థులకు బస్సులు నడిపిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టి శ్రీనివాస్, నాయకులు కోడం వెంకటేష్, కొలనూరు కరుణాకర్, శ్రీనివాస్, అరవింద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన దండే శ్రీనివాస్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, వేములవాడ:** ఎంపీపీల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది ఈ సందర్భంగా వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ గా దండే శ్రీనివాస్ నియమితులయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆడిటర్ ఆఫీసర్ గా పనిచేస్తున్న శ్రీనివాస్ వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లోత్ర వారికి స్వాగతం పలికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ వజీర్ సూపర్డెంట్ విజయేందర్ రెడ్డి సీనియర్ అసిస్టెంట్ చలపతి జూనియర్ అసిస్టెంట్ రాజబాబు, డిఈ పవన కుమారి పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు జంగపల్లిలో



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం:** జంగాపల్లి గ్రామంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఈ కార్యక్రమంలో తల్లిపాల గురించి గర్భిణీల కు బాలింతల కు అవగాహన కల్పించారు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ముర్ర పాలు మొదటి టీకా తల్లిపాలలో పోషకాలు అమృతం అని చెస్ట్ క్యాన్సర్ రాకుండా ఉంటాయి అని నిరు కూడా ఉంటుందని ఆరు నెలలు మరియు తల్లిపాలు ఇవ్వాలి అని తల్లుల గర్భిణీలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ఐసి డిసి సూపర్వజర్ సాహితి గ్రామ అంగన్వాడి టీచర్ అటీకం రజిత బొజ్జ సరోజ తల్లులు మరియు బాలింతలు పాల్గొన్నారు.

# తల్లిపాలతోనే రోగనిరోధక శక్తి పెరుగుదల



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్:** నవజాత శిశువులకు అందించే తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పద్మనగర్ లో గల అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రసవించిన గంటలోపే శిశువుకు ముర్రు పాలు పట్టించాలన్నారు. వీటిలో రోగ నిరోధక శక్తి అత్యధికంగా ఉండి, బాహ్య ప్రపంచంలోకి వచ్చిన చిన్నారులకు వ్యాధులు దరి చేరకుండా అడ్డుకుంటుందన్నారు. పుట్టిననాటి నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలని సూచించారు. ప్రతి గర్భిణీ, బాలింత అంగన్వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా వారికి పౌష్టికాహారం అందజేస్తారని వెల్లడించారు. అలాగే, ప్రతి నెల బరువు తెల్సుకోవాలని, శుక్రవారం సభలకు హాజరై తమలో ఉండే అనారోగ్య లక్షణాలు అంగన్వాడీ టీచర్లకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమారాణి, అంగన్వాడీ టీచర్ ఎ.సరిత, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# చిన్నారి నయనశ్రీ వైద్యానికి అండగా నిలిచిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

- మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు
- చిన్నారి తల్లి, మండల తహసిల్దార్ జాయింట్ ఖాతా ప్రారంభించి 10 లక్షల రూపాయల జమ
- మానవత్వం చాటుకున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వీర్నపల్లి:** వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జెల దిలీప్ శ్యామల దంపతుల చిన్న కూతురైన చిన్నారి నయన శ్రీ క్యాన్సర్ తో బాధ పడుతున్న నేపథ్యంలో ఆ చిన్నారి వైద్య చికిత్స కు సంపూర్ణ మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ముందుకు వచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని చిన్నారి ఇంటిని సందర్శించారు. చిన్నారికి వచ్చిన క్యాన్సర్ వ్యాధి, చికిత్స నిమిత్తం ఇప్పటికే తల్లిదండ్రులు 3 లక్షల రూపాయలను అప్పుచేసి ఖర్చు చేశారని కలెక్టర్ తెలుసుకున్నారు.

చిన్నారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. వీర్నపల్లి మండల తహసిల్దార్, చిన్నారి తల్లి పేరు మీద జాయింట్ బ్యాంకు ఖాతా ప్రారంభించిన వెంటనే అందులో వైద్య ఖర్చుల నిమిత్తం 10 లక్షల రూపాయలు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చిన్నారికి ఉన్న క్యాన్సర్ వ్యాధిని పూర్తిస్థాయిలో నయం చేసేందుకు మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలనే అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు . డీఎంహెచ్ఓ రిపోర్ట్ ప్రకారం చిన్నారి చికిత్స ప్రారంభించాలని, బ్యాంకు లో జమ చేసిన నిధులు చికిత్స కోసం వినియోగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నారి చికిత్స కోసం అవసరమైతే మరిన్ని నిధులను కూడా అందించడానికి సిద్ధంగా ఉన్నామని, తల్లిదండ్రులు ఎటువంటి బెంగ అవసరం లేదని, చిన్నారి వైద్య చికిత్స నిమిత్తం ఏ సమయంలో నైనా, ఎలాంటి సహాయం అవసరం ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

# ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్



**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గొల్లపల్లి రమేష్ యొక్క ద్విచక్ర వాహనం (AP15 BG 7295) గురువారం రోజున అనంతగిరిలో సాయంత్రం సమయం లో గుర్తు తెలియని వ్యక్తి పోచమ్మ గుడి దగ్గర దొంగిలించినట్టు రమేష్ పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి వెతుకగా శుక్రవారం రోజు సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జంగారెడ్డిపల్లె కమాన్ దగ్గర ఒక వ్యక్తి బండి తో అనుమానస్పదం గా కనిపించగా అతన్ని విచారించగా అతని పేరు వల్లెపు దేవాదాస్ సిద్ధిపేట అని తెలిసింది. అతడు తాగుడు కి బానిస అయి ఇలా గత కొంత కాలం గా ద్విచక్ర వాహనాలు దొంగలిస్తున్నట్లు తెలిసిందని . అతడు గురువారం రోజున అనంతగిరి లో ద్విచక్ర వాహనం దొంగలించి నట్లు తెలిసింది. ఇతని దగ్గర నుండి ఒక ద్విచక్ర వాహనం ను స్వాదినం చేసుకోవడం జరిగిందని అతనిపై ఇది సిద్ధిపేట లో కూడా రెండు కేసులు ఉన్నట్లు తెలిసిందని అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్ చెయ్యడం జరిగిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

# చలో హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడి పెండింగ్ బిల్లులు చెలించాలని

**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** రాష్ట్రవ్యాప్తంగాఉన్నగ్రామ పంచాయతీలలో పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే విడుదలచేయాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించగ వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు ఈ కార్యక్రమం లో మాజీ మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు చల్లా నారాయణ మరియు ఇల్లంతకుంట గ్రామాల మాజీ సర్పంచ్ లు పాల్గొన్నారు.



## సంపాదకీయం

శనివారం, ఆగస్టు 3, 2024

# అమ్మపాలు అమృతాహారం..!

అమృతతుల్యమైన అమ్మపాలలో శిశు సమగ్రాభివృద్ధికి దోహదపడే మాంసకృత్తులు, పిండి పదార్థాలు, ఐరన్, కాల్షియం, ఖనిజాలు, యాంటీబాడీలు, విటమిన్లు, కొవ్వులతో పాటు అనేక ఇతర అవసర పోషకాలు సమపాళ్ళలో ఉంటాయి. న్యుమోనియా, కలరా, కామెర్లు లాంటి పలు వ్యాధుల నుంచి శిశువును రక్షించగలిగే అమ్మ రొమ్ము పాలు జీవితాంతం వ్యాధినిరోధకశక్తిని అందించే అత్యుత్తమ సహజ టీకా ఔషధంగా పని చేస్తుంది. తల్లిపాలు అందించడంతో శిశువు ఎదుగుదలే కాకుండా తల్లి ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. బిడ్డ ప్రసవం జరగ్గానే లభించే ముర్రు పాలలో అద్వితీయ పోషక విలువలు ఉంటాయి. ముర్రు పాలతో ప్రత్యేక పోషకాలు లభించడమే కాకుండా వ్యాధికారక వైరస్‌లు, బ్యాక్టీరియాల పట్ల నిరోధకశక్తి పెరుగుతుంది. ముర్రుపాలు మంచివి కావనే దురభిప్రాయాలను దూరం చేస్తూ, రొమ్ము పాలు తప్పక కనీసం ఒక ఏడాదికి పైగా తాగించి, శిశువు జీవితకాల ఆరోగ్యానికి పునాదులు వేయాలి. ముర్రు పాలతో శిశువు పేగుల శుద్ధి జరగడం, ఎలర్జీలను నిరోధించడం, జీవితాంతం పలు ప్రమాదకర రోగాలు రాకుండా నివారించడం, శిశు శారీరక మానసిక వికాసానికి దోహదపడడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. శిశు జననం నుంచి కనీసం ఆరు మాసాల వరకు అమ్మ రొమ్ముపాలు తప్పనిసరిగా అందించాలి. శిశువు ఆరు మాసాలు దాటిన తరువాత 1-2 ఏండ్ల పాటు అమ్మ రొమ్ముపాలు అందించడం ద్వారా పిల్లల సమగ్ర ఎదుగుదల సమకూరుతుంది. తల్లి రొమ్ముపాల ప్రాధాన్యతను మాతృమూర్తులకు వివరించడానికి ప్రతి ఏటా ఆగష్టు 01-07 వరకు 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాల'ను ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. 1992లో ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలను 170కి పైగా ఐరాస సభ్యదేశాలు పాటిస్తున్నాయి. యూనిసెఫ్, డబ్ల్యూహెచ్ఓ, స్థానిక ప్రభుత్వాలు సంయుక్తంగా తల్లిపాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2024 థీమ్ 'క్లోజింగ్ ది గ్యాప్ - బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఆల్' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 7.6 మిలియన్ల శిశువులకు తల్లి పాలు అందడం లేదని, అధిక ఆదాయ వర్గాల్లో 21 శాతం, మధ్య తరగతి పిల్లల్లో 4 శాతం రొమ్ముపాల రుచిని చూడడమే లేదు. ఇండియా, చైనా, నైజీరియా, ఇండోనేషియా లాంటి దేశాల్లో తల్లిపాలు లభించని కారణంగా పలు వ్యాధులతో ప్రతి ఏట లక్షల శిశు మరణాలు నమోదు అవుతున్నాయి. భారతదేశంలో 79 శాతం ప్రసవాలు ఆరోగ్య కేంద్రాలలో జరిగినప్పటికీ, తొలి గంటలో 42.6 శాతం తల్లులు మాత్రమే రొమ్ము పాలు అందిస్తున్నారని తెలుస్తున్నది. తొలి ఆరు మాసాలు తల్లి పాలు మాత్రమే అందించి, అనంతరం అదనపు పోషకాహారంతో పాటు రొమ్ముపాలు అందించాలి. సంపన్న కుటుంబాల తల్లుల కంటే పేద కుటుంబాల తల్లులే అధికంగా చనుబాలను అందిస్తున్నారు. శిశు జననంతో తల్లి రెమ్ము పాలు ఉత్పత్తి కావడం, నవజాత శిశువు రొమ్ము పట్టి పాలు త్రాగడం, తల్లిబిడ్డల మధ్య అద్వితీయ ప్రేమానుబంధాలు ఉద్భవించడం ఓ అద్భుత సృష్టి రహస్యమనే చెప్పాలి. తల్లి రొమ్ముపాలు అందించాలనే లక్ష్యంతో ఉద్యోగిణులకు, ఉద్యోగులకు ప్రత్యేక సెలవుల సౌకర్యం కల్పించబడింది. రొమ్ముపాలు పట్టించడం వల్ల తల్లులకు రొమ్ము కాన్సర్, ఓవేరియన్ కాన్సర్, మధుమేహం, స్థూలకాయం, రక్తస్రావం, గుండె జబ్బులు, వెంటనే గర్భం దాల్చే అవకాశం లాంటి సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి. తల్లి పాలు ఇవ్వడం వల్ల శారీరక సౌందర్యం తగ్గుతుందనే దురభిప్రాయంతో సంపన్న కుటుంబాల్లోని తల్లులు రొమ్ముపాలు ఇవ్వడానికి చొరవ చూపక పోవడం అమానవీయం, ఆక్షేపణీయం. తల్లిపాల పట్ల విస్తృత అవగాహన కల్పించినప్పటికి 50 శాతం తల్లులు తొలి ఆరు మాసాలు, 25 శాతం తొలి ఏడాది వరకు రొమ్ముపాలు అందిస్తున్నారని తేలింది. పేద కుటుంబాల్లో తల్లుల అనారోగ్యం, పాలు పడకపోవడం, పని ఒత్తిడిలో నిర్లక్ష్యం చేయడం, అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో పిల్లలు బలహీనంగా ఉంటూ, రోగాల పాలు కావడం, కొన్ని సందర్భాలలో మరణించడం కూడా సంభవిస్తున్నాయి. కరోనా విపత్తులో పేదరికం పెరగడం, ఆర్థికంగా చితికి పోవడం, ఉపాధులు లేకపోవడంతో తల్లిపాలు అందించడంలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గర్భిణి, తల్లి, శిశువు ఆరోగ్య రక్షణకు అవసరమైన ఆసుపత్రులను నెలకొల్పవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. తల్లి, బిడ్డలతో పాటు సకల జనుల ఆరోగ్య సౌభాగ్యాలకు పునాదిగా నిలుస్తున్న తల్లిపాలను రక్షించి, చిన్నారులకు అందించి, ఆరోగ్య సమాజాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దాం, లేత శిశువు ఎదుగుదలకు కంకణ బద్ధులం అవుదాం. గర్భం దాల్చడం, రొమ్ముపాలు అందించడం అనే ముఖ్య అంశాలే రేపటి సమాజ నిర్మాణానికి దోహదపడతాయని గుర్తుంచుకోవాలి. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మాతశిశు ఆరోగ్యం, పోషకాహారం, పేదరిక నిర్మూలన, ఆహార భద్రత లాంటి అంశాలకు ప్రాధాన్యతలను ఇవ్వాలి.

# ప్రజా పాలన కాదు: ఇది ప్రతీకార పాలన

- బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి
- రైతు రుణమాఫీకి ప్రామాణికం ఆధార్ కార్డా? రేషన్ కార్డా?
- అసెంబ్లీ సాక్షిగా మహిళలను అవమాన పరుస్తున్నారు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలిపెట్టం
- ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం








(నాగర్ కర్నూల్ బ్యూరో, ఆగస్టు 2) కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన అందిస్తామని చెప్పి నేడు ప్రతీకార పాలన చేస్తున్నారని నాగర్ కర్నూల్ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక అబద్ధాల పార్టీ అని అధికారంలోనికి వచ్చిన 100 రోజులలో ఆరు గ్యారెంటీలు పూర్తి చేస్తామని వాగ్దానం చేసి అధికారంలో వచ్చాక దాదాపుగా 8 నెలలు నడుస్తున్న కేవలం ఒక ఫ్రీ బస్సు తప్ప ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆయన ఎద్దేవ చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి పరిపాలన పై అవగాహన లేదు అని ఆయనకు కేవలం బి ఆర్ ఎస్ పార్టీని, కెసిఆర్ కుటుంబాన్ని నిందించడానికి ముఖ్యమంత్రిగా అయినట్లుగా ఉన్నదని, ఒక పది సంవత్సరాలు ముఖ్యమంత్రి పదవిని చేపట్టినటువంటి వ్యక్తినిక్కి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకుండా కెసిఆర్ కు పిండం పెడతా, జైలుకు పంపిస్తాం అని తనకు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతూ ముఖ్య మంత్రి పదవికున్న పరువు తీస్తున్నాడని ఆయన అన్నాడు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ వృద్ధాప్య పింఛన్, అన్ని పథకాలు ఎప్పటికప్పుడు ఫోన్లో మెసేజ్లు వచ్చేదని ఇప్పుడు కనీసం పొయ్యి అడుగుతే కూడా బాధ్యతగా వారికి సమాధానం ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో నోటికి వచ్చిన హామీలను ఇచ్చారని కానీ మొన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దానికి ఏమాత్రం పొంతన లేదు అని ఆయన అన్నారు. రైతు భరోసాపై ఇప్పటికి సరైన విధి విధానాలు రూపొందాలేదని పాలనను పక్కనపెట్టి ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కొనుక్కున్న పనిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారని ఆయన ఎద్దేవ చేశారు. మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారే తప్ప 100 రోజుల్లో అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చారు. మహిళలకు 2500 ఎప్పుడు ఇస్తారని, వృద్ధులకు ?4,000 పింఛను, నిరుద్యోగ భృతి అమలు చేయకుండా నిరుద్యోగ సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్రంలో శాంతిభద్రతలకు అదుపు లేకుండా పోయిందని అన్నారు. రోజుకు హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని కందనూలును ఫ్యాక్షన్ కందనులుగా మార్చారని ఆయన అన్నారు. రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగి తలలు పట్టుకుంటున్నారని ముఖ్యమంత్రి రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆంచల పేరట రైతుల కొట్టదని రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేయాలని అది చేసేంతవరకు విడిసి పెట్టేది లేదు అని ఆయన హెచ్చరించారు. రైతులకు మీరు ఏమి ఇస్తారో, ఎంతవరకు కటాఫ్ చేస్తారో అవి విధివిధానాలు తెలిపి దాని ప్రకారంగా వారికి రైతు రుణమాఫీలు చేయాలని ఆయన సూచించారు.

**రైతు రుణమాఫీకి ప్రామాణికం ఆధార్ కార్డా లేక రేషన్ కార్డా?**

రైతు రుణమాఫీకి ప్రామాణికం ముఖ్యమంత్రికి గానీ, మంత్రులకు గాని, ఎమ్మెల్యేలకు కూడా ఎవరికీ పూర్తి గ సమాచారం లేదని ఒకరు వచ్చి రేషన్ కార్డు ప్రామాణికమని మరొకరు ఆధార్ కార్డుని మరొకరు ఆధారు రేషన్ కార్డుని ఇష్టమొచ్చినట్టు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. అసలు రైతు రుణమాఫీ ఏది ప్రామాణికమో ఆధార్ కార్డు లేక రేషన్ కార్డు ఏదో ఒకటి పూర్తి సమాచారం ఇవ్వాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు 1లక్ష 50 వేల రుణమాఫీ చేశామని ప్రకటించారు కానీ అందులో సగం మంది కూడా రుణమాఫీ కాలేదు అని రైతులు బ్యాంకు చుట్టూ మీసేవ చెట్టు తిరుగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఏది చేసినా పకడ్బందీగా చేసి రైతులను ఈ విధంగా తిప్పడం లేదని ఆయన అన్నారు. ఆగస్టు 15 లోపల రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దేవుళ్ళ పైన, ప్రజల పైన ఓట్లు వేశారని ఆ ఒట్టు నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికీ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే హరీష్ రావు విసిరిన సవాలుకు సిద్ధంగా ఉన్నారని మీరు కూడా ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు, రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15 తారీకు లోపల చేసి మీ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం బాగా చేస్తోందని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే సాగు, తాగు నీరు ఇవ్వకుండా కరెంటు కట్ చేస్తూ ప్రజలను చీకట్లో తోసేసారని ఆయన ఆవేదన చేశారు.

బిఆర్ఎస్ పాలనలో 24 గంటల కరెంటు ఇచ్చి రైతులను ఆదుకున్నదని మూడు పంటలకు నీరు పంట సహాయం ఫ్రీ విత్తనాలు రైతులకు కావాల్సినవి సబ్సిడీలు ఇచ్చి ఆదుకున్నదని ఆయన అన్నారు.

**అసెంబ్లీ సాక్షిగా మహిళలకు అవమాన పరుస్తున్నారు**

ఎక్కడ మహిళలను పూజిస్తారో అక్కడ దేవతలు ప్రత్యక్షమైతారన్న మాటకు ప్రత్యక్షమ్ బిఆర్ఎస్ పార్టీలో మహిళలను అంత గౌరపరిచే విధంగా ఉన్నది కానీ నేడు కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అసెంబ్లీలో నిలదీస్తే మహిళలు అని చూడకుండా వారిపై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతూ వారిని అవమాన పరుస్తున్నారని ఆయన ఎద్దేవ చేసినారు. ప్రజలు మీకు అధికారం ఇచ్చింది వారికి మేలు చేస్తారని కానీ ప్రశ్నిస్తే పోలీసుల తో కొట్టి కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని కాదని ఆయన అన్నారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని ఐదు సంవత్సరాలు అధికారం ఉంటారు కానీ మళ్లీ మా పార్టీ కూడా అధికారంలోకి వస్తుందని కాబట్టి అధికారం ఎవరికి శాశ్వతం కాదు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసుకోకుండా ప్రజలకు మేలు చేయాలని ఆయన సూచించారు.


**ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం**

ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచి బిఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని ఉద్యమ నాయకుడుగా కేసీఆర్ ఆనాడే వర్గీకరణ కోసం డిమాండ్ చేశారని నిన్న వెలవడిన ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపించిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని 16 మే 2016లో ప్రధాని మోడీకి స్వయంగా కేసీఆర్ కలిసి లేక అందించారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని తద్వారా విద్యా ఉద్యోగ అవకాశాల్లో యువతకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మరియు పార్టీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయాలి



**- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**







నాగర్ కర్నూల్ బ్యూరో, ఆగస్టు 2) నాగర్ కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నూతన భవనాన్ని వైద్య విద్యార్థుల తరగతుల నిర్వహణకు అన్నివిధాలా ఆగస్టు 15 నాటికి సిద్ధం చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ఉయ్యాలవాడ సమీపంలో 25 ఎకరాల్లో 166 కోట్ల రూపాయలతో నిర్మితమవుతున్న నూతన మెడికల్ కళాశాల భవనం మెడికల్ కళాశాల విద్యా ర్థుల (బాల బాలికలు) ప్రొఫెసర్ల వసతి గృహాలు భవన నిర్మాణ పనులను శుక్ర వారం కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మితమైతున్న మెడికల్ కళాశాల తరగతి గదుల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

మెడికల్ కళాశాలలో ప్రస్తుతం గత రెండు బ్యాచులకు చెందిన మొదటి, రెండవ ఎంబిబిఎస్ 300 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ తరగతులు ప్రస్తుతం భవనంలో నిర్వహిస్తున్నారని, ఈ సంవత్సరానికి మెడికల్ కళాశాలకు మరో 150 మంది విద్యార్థులతో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ తరగతులు ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఈ దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన మెడికల్ కళాశాల భవనం, హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో తరగతి గదులు, ల్యాబ్, ఆధునిక వసతులతో నిర్మించిన ప్రొఫెసర్ గదులు, కిచెన్, హాస్టల్ రూమ్స్, టాయిలెట్స్, వాటర్, పైపింగ్ సిస్టం, ఎలక్ట్రిసిటీని కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని, చిన్న చిన్న చివరి దశ పనులు ఉన్నాయని త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నూతన మెడికల్ కళాశాల భవనంలో 750 మంది విద్యార్థులు చదువుకునే విధంగా భవన నిర్మాణం, తరగతి గదుల నిర్మాణంతో చేపట్టినట్టు తెలిపారు. కళాశాలలో తరగతి గదులను నాన్ క్లినికల్ సంబంధించి అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ, సైన్సెస్ మ్యూజియం విభాగాలలో, క్లినికల్ విభాగంలో రేడియాలజీ, ల్యాబ్లు, కళాశాల లైబ్రరీని కలెక్టర్ పరిశీలించి వివరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీలో వైద్య విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు లైబ్రరీలో పుస్తకాల వినియోగం వసతి భోజనం ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రిన్సిపల్ తో సమావేశమై వైద్య కళాశాలలో కావాల్సిన వసతుల ఏర్పాట్లు వైద్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాదేవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గౌసియా, అసిస్టెంట్ డైరెక్టర్ గౌస్, ఆర్ అండ్ బి డిఈ రమాదేవి, దాస్ కన్స్ట్రక్షన్స్ టెక్నికల్ అసిస్టెంట్ వీరేష్ తదితరులు ఉన్నారు.

### ఒక్క నోటిఫికేషన్ అయినా ఇచ్చారా? దమ్ముంటే సమాధానం చెప్పు..

# రేవంత్‌రెడ్డిని నిలదీసిన హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ ఒక జోక్ క్యాలెండర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. విద్యార్థులను కాంగ్రెస్ పార్టీ దగా చేసిందని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి తీసుకెళ్లారు. కాసేపటికి వదిలేశారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న హరీశ్‌రావు నిరుద్యోగ యువతతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చెప్పిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు బస్సులు పెట్టి గ్రామాలు తిప్పి ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ఇన్ని చేసి గద్దెనెక్కినంక విద్యార్థులను మరిచిపోయారని మండిపడ్డారు. మొదటి క్యాబినెట్‌లోనే జాబ్ క్యాలెండర్ అని చెప్పి.. 8 నెలల తర్వాత జాబ్ క్యాలెండర్‌లో ఏమైనా ఉన్నదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో స్టేట్‌మెంట్ ఇస్తే ఎవరు ఇచ్చారనేది ఉంటుందని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్‌లో పేరు, సంతకం లేదని తెలిపారు. ఒక చిత్తు కాగితంలాగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించారని మండిపడ్డారు.



చర్చ కూడా లేకుండానే జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి చదివి వెళ్లిపోయారని హరీశ్‌రావు తెలిపారు. లక్షలాది మంది యువతీయువకుల కంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటుందా అని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ చేయమంటే ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. దమ్ముంటే మాట్లాడాలని కదా అని నిలదీశారు. మిమ్మల్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. నిరుద్యోగుల తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

అభయ హస్తం మానిఫెస్టోలో చెప్పినవి ఒక్కటీ అమలు చేయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. మీరు ఉద్యోగాలు ఇచ్చింది నిజమైతే గన్‌మెన్ లేకుండా అశోక్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని సవాలు విసిరారు. డేట్, టైమ్ చెబితే తాను వస్తానని తెలిపారు. నిరుద్యోగ యువత నుంచి ఎన్ని రోజులు దాక్కుంటారని ప్రశ్నించారు. ఎక్కువ రోజులు తప్పించుకోలేరని అన్నారు. యువతకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రెడిబులిటీ ఉంటే వచ్చి సమాధానం చెప్పాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. లేదంటే నిరుద్యోగ యువతతో తానే ఏఐసీసీ కార్యాలయానికి వచ్చి నిలదీస్తామని హెచ్చరించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలకు మైక్ ఇవ్వడం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో అన్నీ ఆంక్షలేనని.. అడిగితే కేసులు పెడతారని విమర్శించారు. ఉద్యోగాల గురించి అడిగితే కేసులు పెడుతరా.. ట్రోలింగ్ చేస్తరా అని నిలదీశారు. తెలంగాణ నిరుద్యోగ యువతను కాంగ్రెస్ దగా చేసిందని మండిపడ్డారు. శాసనసభ చరిత్రలో ఈరోజు బ్లాక్ డే అని వ్యాఖ్యానించారు. శాసనసభ కౌరవ సభగా మారిందని విమర్శించారు. ఇది ఉద్యమాల గడ్డ అని, దబాయింపులకు తావు లేదన్నారు. తమను బెదిరింపులు ఏం చేయలేవని తెలిపారు.

## నాపై దాడికి వ్యూహ రచన: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో తన 'చక్రవ్యూహం' ప్రసంగం తరువాత తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడికి వ్యూహరచన జరుగుతోందని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. కేరళ వాయనాడ్‌లో కొండచరియల విలయం నేపథ్యంలో అక్కడి ఎంపిగా తన జవాబుదారతనం గురించి జనం అడగకుండా దారి మళ్లించేందుకు రాహుల్ కొత్త కథనం సృష్టిస్తున్నారని బిజెపి విమర్శించింది. 'టూ ఇన్ వన్‌కు నా చక్రవ్యూహం ప్రసంగం నచ్చినట్లు లేదు. నాపై దాడికి వ్యూహ రచన జరుగుతోందని ఇది అంతరంగికులు నాకు చెప్పారు' అని రాహుల్ గాంధీ శుక్రవారం తెల్లవారు జామున 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇడి డైరెక్టర్‌ను రెండు చేతులతోను స్వాగతించేందుకు నిరీక్షిస్తున్నా' అని ఆయన తెలిపారు. మరొక పరిణామంలో రాజకీయ వేధింపు నిమిత్తం ఇడి, సిబిఐ, ఆదాయపు పన్ను (ఐటి) శాఖ వంటి సంస్థలను బిజెపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుండడం'పై వాయిదా తీర్మానానికి కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్ నోటీస్ అందజేశారు. 'రాజకీయ వేధింపు కోసం ఇడి, సిబిఐ, ఐటి వంటి సంస్థలను బిజెపి ప్రభుత్వం దుర్వినియోగం చేయడాన్ని ప్రతిపక్షం గర్హిస్తున్నది. తమ బలం 303 నుంచి 240కి తగ్గిపోయినప్పటికీ, టిడిపి, జెడియుతో పొత్తుపై ఆధారపడుతున్నప్పటికీ, ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను బెదిరించడానికి, ప్రజాస్వామ్య సిద్ధాంతాలను కించపరచడానికి, తమకు వత్తాసు పలికేలా ఒత్తిడి చేయడానికి ఆ సంస్థలను నియోగిస్తూనే ఉన్నది. ప్రభుత్వ అధికారాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేయడం సమ్మతనీయం కాదు. మన వ్యవస్థల సమగ్రతకు ముప్పు కలిగిస్తోంది' అని ఆ నోటీస్ వివరించింది. రాహుల్ గాంధీ ఆరోపణకు బిజెపి నేత, మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ, తన జవాబుదారీతనం గురించి జనం ప్రశ్నలు అడుగుతున్నారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షునికి చెప్పి ఉండవచ్చునని, అందుకే ఆయన కొత్త కథనం సృష్టిస్తున్నారని విమర్శించారు. అయితే, పలువురు కాంగ్రెస్, ప్రతిపక్ష నాయకులు రాహుల్‌కు వత్తాసుగా నిలిచారు. దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం 'దుర్వినియోగం చేస్తున్నది' అని వారు ఆరోపించారు.

## ధరణితో రైతులు అష్టకష్టాలు .. మంత్రి పొంగులేటి



హైదరాబాద్ : గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ తో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, గుంట భూమి కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని మంత్రి పొంగులే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి నేడు ధరణి పై మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుంది అని విశ్వాసంలో ఉన్నారు ప్రజలు అన్నారు.

ధరణి నీ ఐఎల్ ఎఫ్ కంపనీకి కోసీఆర్ అప్పగించారని మండిపడ్డారు. ఆ కంపనీ కొన్ని కారణాలతో.. సింగపూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ కంపనీ కి తెలంగాణ భూములు తాకట్టు పెట్టారు కేసీఆర్ అని మండిపడ్డారు. డిఫాల్ట్ కంపనీ కి ధరణి పోర్టల్ అప్పగించారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన నిర్వాకంతో రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఇద్దరు వ్యక్తులు కూర్చొని చేసిన చట్టం ధరణి అన్నారు. ఆల్ ఇన్ వన్ గా చెప్పుకున్న పెద్దాయన చేసిన నిర్వాకం ఇది అని తెలిపారు. .. 2014 లో ధరణి తెచ్చారు కేసీఆర్ అన్నారు. కొండ నాలుక కి మందు వేస్తే... ఉన్న నాలిక పోయినట్టు ఉంది ధరణి అని అన్నారు.

ధరణి పేరుతో దగా చేశారు అన్నది నిజం అని అన్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రం.. ధృతరాష్ట్ర కౌగిలో ఇరుక్కుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంచి ఎవరు చేసినా ప్రజలు గుర్తుపెట్టుకుంటారని అంటూ ఇందిరమ్మ ని ఇప్పటికి గుర్తు పెట్టుకుంటున్నారని అన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తీసుకొచ్చి పేదలకు భూములు పంపిణీ చేసిందన్నారు. వైఎస్ హయాంలో బీడు భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. భూ సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు తెస్తామని అనేక మంది చెప్పారని.. ఇవాళ ఎక్కడ చూసినా భూ సమస్యలే కనిపిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు పొంగులేటి. . పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా భూసంస్కరణలు చేపట్టారన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిన భూదాన ఉద్యమం ఇక్కడే పుట్టిందన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తెచ్చి పేదలకు భూములను పంచిందని గుర్తు చేశారు.

## రేవంత్ నీ సిఎం పదవి పోయే ఛాన్స్ ఉంది: కౌశిక్ రెడ్డి



హైదరాబాద్: శాసన సభలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ సబితా ఇంద్రారెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అవమానించారని ఎంఎల్ఎ కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. క్షమాపణలు చెప్పమంటే బిఆర్ఎస్ ఎంఎల్ఎపై ఎదురుదాడికి దిగారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సిఎం రేవంత్ పలుమార్లు బిఆర్ఎస్ ఎంఎల్ఎల సభ్యత్వాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని, రేవంత్ రెడ్డి అమెరికాకు వెళ్లిన తరువాత ఆయన సభ్యత్వం రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఖమ్మం లేదా నల్లగొండ నేతలు రేవంత్ పదవిని లాక్కునే అవకాశం ఉందని, చిట్‌చాట్‌లో కొందరు మంత్రులు ఇదే విషయాన్ని చెబుతున్నారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవాలని కౌశిక్ రెడ్డి చురకలంటించారు.

## లైవ్ డిబేట్‌లో ఆర్‌జే శేఖర్ భాషాను చెప్పుతో కొట్టిన రాజ్‌తరుణ్ ప్రేయసి లావణ్య



ఈ మధ్య టాలీవుడ్‌లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు లావణ్య. నటుడు రాజ్ తరుణ్ తనను మోసం చేశాడంటూ లావణ్య ఎప్పుడైతే ప్రకటించిందో అప్పటి నుంచి వీరికి సంబంధించిన వార్తలు ఫుల్ వైరల్ అవుతున్నాయి. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నటి మాల్వీ మల్హోత్రాతో ఎఫైర్ కారణంగా తనను వదిలేసి వెళ్లిపోయాడని నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది లావణ్య. అయితే ఈ వివాదం గత కొన్ని రోజులుగా జరుగుతుండగా.. ఈ ఘటనపై రీసెంట్‌గా రాజ్ తరుణ్ స్పందిస్తూ.. లావణ్య నాపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రతిదానికి నా దగ్గర ఆధారం ఉంది. నాకు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు. కచ్చితంగా నేను లీగల్‌గానే వెళతాను న్యాయం జరిగే వరకు పోరాడుతా అంటూ ఒక మూవీ ప్రెస్ మీట్‌లో చెప్పుకోచ్చాడు. అయితే దీనిపై మాట్లాడానికి ఒక ఛానల్ లైవ్ షోకి వచ్చిన లావణ్య.. అక్కడ మాట్లాడుతున్న ఆర్‌జే శేఖర్ భాషాను చెప్పుతో కొట్టింది. లైవ్‌లో ఆర్‌జే శేఖర్ మాట్లాడుతుండగా.. ఆ మాటలు నచ్చని లావణ్య ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి శేఖర్‌పై చెప్పు విసిరేసింది. దీంతో ఈ లైవ్‌షో రసభసగా మారింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ.. లావణ్యపై విరుచుకుపడుతున్నారు.

### ఎన్నికల బాండ్ల పథకంపై పిటిషన్లను

## తిరస్కరించిన సుప్రీం





న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల పథకంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద ఈ దశలో తాము జోక్యం చేసుకోవడం సబబు కాదని, తొందరపాటు అవుతుందని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దీవాలాతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. అది క్విడ్ ప్రో కో లేదా కాంట్రాక్టు ఇవ్వడం అన్న అభిప్రాయంతో ఎన్నికల బాండ్ల కొనుగోలుపై తాము దర్యాప్తునకు ఆదేశించలేమని ధర్మాసనం తెలిపింది. న్యాయ సమీక్షకు అర్హమైనవన్న అభిప్రాయంతో ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కోర్టు అనుమతించింది. నేరపూరితమైన కార్యకలాపాలపై చర్యల కోసం చట్ట పరిధిలో వేరే పరిష్కార మార్గాలు ఉండగా ఈ కేసులను ఆర్టికల్ 32 కింద విచారణకు స్వీకరించలేమని పిటిషనర్లు కామన్ కాజ్, సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటెరెస్ట్ లిటిగేషన్, ఇతర ఎన్జీవోలకు ధర్మాసనం తెలిపింది. ఎన్నికల బాండ్ల పథకం కింద రాజకీయ పార్టీలు, కార్పొరేషన్లు, దర్యాప్తు సంస్థల మధ్య క్విడ్ ప్రో కో జరిగిందని ఆరోపిస్తూ రెండు ఎన్జీవోలు పిల్ దాఖలు చేశాయి.

## గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో అదనంగా 60 పోస్టులు

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు యూపిఎస్సీ కమిషన్ చైర్మన్‌ను సంప్రదించారని, యూపీఎస్సీ, కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సీనియర్ ఐఏఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేయించామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో అదనంగా 60 పోస్టులు జోడించి 563 ఖాళీల కోసం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేశామని ఆయన తెలిపారు. ఫలితాలు ప్రకటించామని, ఈ ఏడాది అక్టోబర్ 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మెయిన్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేశామని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే 32,410 మంది నిరుద్యోగ యువతకు నియామక ఉత్తర్వులు జారీ చేశామని, అదనంగా 13,505 ఉద్యోగాల నియామకం చివరి దశకు చేరుకుందన్నారు. 11,022 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల మధ్య తగిన సమయం లేకపోవడంతో నిరుద్యోగుల కోరిక మేరకు ఆగస్టు 7, 8 తేదీల్లో జరగాల్సిన గ్రూప్ 2 పరీక్షలు నిరుద్యోగుల కోరిక మేరకు డిసెంబర్‌కు వాయిదా వేశామని ఆయన తెలిపారు. కేబినెట్ సమావేశంలో జాబ్ క్యాలండర్ గురించి చర్చించి ఆమోదించామని, 2024, 25 సంవత్సరానికి సంబంధించి జాబ్ క్యాలండర్‌ను సభ్యులకు అందచేశామని ఆయన పేర్కొన్నారు.

| ఉద్యోగం పేరు/శాఖ | నోటిఫికేషన్ తేదీ | పరీక్షలు నిర్వహించే తేదీ |
|---|---|---|
| గ్రూప్-1 పరీక్షలు | ఫిబ్రవరి 2024 | అక్టోబర్ 21 నుంచి 27ల మధ్య |
| గ్రూప్-3 | డిసెంబర్ 2022 | నవంబర్ 17 నుంచి 18ల మధ్య |
| గ్రూప్-2 | డిసెంబర్ 2022 | డిసెంబర్ 2024లో |
| వైద్య,ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ | సెప్టెంబర్ 2024 | నవంబర్ 2024లో |
| ట్రాన్స్‌కోలో వివిధ ఇంజనీరింగ్ ఉద్యోగాల కోసం | అక్టోబర్ 2024లో | జనవరి 2025లో |
| టెట్ నోటిఫికేషన్ | నవంబర్ 2024లో | జనవరి 2025లో |
| వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం | జనవరి 2025లో | ఏప్రిల్ 2025లో |
| డిఎస్సీ నోటిఫికేషన్ | ఫిబ్రవరి 2025లో | ఏప్రిల్ 2025లో |
| ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు | ఫిబ్రవరి 2025లో | మే 2025లో |
| గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష | ఫిబ్రవరి 2025లో | జూలై 2025లో |
| ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు | ఏప్రిల్ 2025లో | ఆగష్టు 2025లో |
| డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు | జూన్ 2025లో | సెప్టెంబర్ 2025లో |
| మరోసారి గ్రూపు 2 నోటిఫికేషన్ | మే 2025లో | అక్టోబర్ 2025లో |
| గ్రూప్-3 నోటిఫికేషన్ | జూలై 2025లో | నవంబర్ 2025లో |
| సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం | జూలై 2025లో | నవంబర్ 2025లో |

## అత్యాచారాలు, సైబర్‌క్రైమ్‌పై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి: కెటిఆర్



హైదరాబాద్: అత్యాచారాలు, సైబర్‌క్రైమ్‌పై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెటిఆర్ తెలిపారు. అత్యాచారాలు చేసిన వారికి త్వరగా శిక్ష పడాలని, బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందనే భరోసా ఇవ్వాలన్నారు. శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశ పెట్టారు. సివిల్ కోర్టుల సవరణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కెటిఆర్ ప్రసంగించారు. సైబర్ క్రైమ్ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్‌క్రైమ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు త్వరగా భర్తీ చేయాలని, కేంద్ర చట్టాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరి చెప్పాలని నిలదీశారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే చట్టాలు తీసుకరావడం మంచిది కాదని కెటిఆర్ హితువుపలికారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హరించేలా కొన్ని చట్టాలు వస్తున్నాయని, సభలో మా సభ్యులు ఎవరూ వీడియోలు తీయలేదని, అసెంబ్లీలోని కెమెరాలన్నీ స్పీకర్ ఆధీనంలోలో ఉంటాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం జరుగుతోందని, ప్రధాని నరేంద్ర మోడీ, సిఎంల వ్యక్తిత్వాన్ని కూడా కించపరిచేలా వీడియోలు వచ్చాయని, తెలంగాణకు లబ్ధి కలిగించే విషయాల్లో అందరూ కలిసి పని చేయాలని కెటిఆర్ పిలుపునిచ్చారు.